కథ

# నాగుల కొండ

ప్రభు

"పెద్ద కొండేం కాదుగానీ ఈ చాగల్నాడు మొత్తానికి బంగారు కొండండి... దాని మీద ఆ చిన్న చిన్న తుప్పలూ చెట్లూ ఉన్నాయి కదండీ... మాపటేళల్లో చెవిల పిల్లుల కోసం యాటకి వొచ్చేవాళ్లు పూర్వం... యిప్పుళ్లేదు లెండి. కాపోతే దీనికో సిన్న కతుందండి. యిప్పుడా కొండ కనిపిత్తందాండీ... సూదిగా పైకి లేచినట్టుంది కదా... అలాగే ఈ కొండ బూవి లోపటకి కూడా అట్టాగే ఉందంటండి... దాని సిగ మీద అంటే లోపటన్న మాటండి... సిగ మీద అంతులేని నిధులున్నయంటండి... ఆ నిధిని అన్యులెత్తుక పోకుండా ఈ కొండ మీన రెండు పాములు... రెండు తలల పావులండీ... రెండు పాములు కాపలా కాస్తన్నయంటండి... అయ్యేమో ఎవలికీ ఆపడవనుకోండి... షష్ఠి యెల్లిన ఏడో రోజున యిక్కడ తీర్తవండి... అట్టాటిట్టాటి తీర్తం కాదండి... కొండమీదా... కిందా తోటల్లోనూ యేల మంది జనం... మళ్లీ మరుసట్రోజుని పురుగ్గూడా ఆపడదు..."

"యిలాంటి మూఢ నమ్మకాల వల్లనే మన దేశం అభివృద్ధి చెందలేకపోతోంది" అంతా విని అన్నాడు గోపీనాథ్.


కాకినాడ నించి రాజమండ్రి పోయే ఏడీబీ రోడ్డులో రామేశం పేట ఇవతల ఎత్తుగా ఉన్న రోడ్డు కాస్తంత పల్లంలో చెరువు. వెనగ్గా కొంత మైదానం... వెనక ఒక ఎత్తయిన కొండ.

గోపీనాథ్ తాము వచ్చిన సుమోని ఆనుకొని సిగరెట్ కాలుస్తున్నాడు. విశ్వేశ్వరరావు మాత్రం రోడ్డు అంచుకు వెళ్లి కొండని దగ్గరగా చూస్తున్నాడు. కొండ గురించి చెప్పిన సుబ్బరాజు రోడ్డు పక్కన ఉన్న రైతుల మకాం పాక(నిజానికది రేకుషెడ్డు) అరుగు మీద కూర్చుని బీడీ కాలుస్తున్నాడు.

విస్తారంగా వర్షాలు పడుతున్న శ్రావణ మాసపు తొలి రోజులు. ఆకాశంలో ఐరావతాల్లాంటి మబ్బులు ఊరేగింపు తీస్తున్నాయి. కింద కుంకుమ రంగు నేల. దాని మీద చిగుర్లు తొడిగిన మొక్కలు... తీగలు... చెట్లు... కొండకి ముందు మామిడి, జీడిమామిడి తోటలున్నాయి. కొండ మీద గుబురు పొదలూ చెట్లూ నీలి ఆకాశం మీదికి ఎక్కుతున్నట్టున్నాయి.

చెరువు నిండా నీళ్లున్నాయి. ఆకాశపు నీలిరంగూ... సూర్యుడి ఎండ తళతళల్లో చెరువు చందమామలా మెరుస్తోంది. నిన్నటివరకూ కురిసిన వర్షానికి మొక్కలన్నీ పాపాయి స్నానం చేసినట్టున్నాయి. ఉండుండి ఒక్కసారి పాపాయిలాగా కదలి కిలకిలమంటున్నాయి. ఒక పరిశుభ్రమైన గాలి చెట్ల మీంచీ... మట్టి మీంచీ... చెరువు మీంచీ వీస్తూ ఊపిరికి ఆకలి పుట్టిస్తోంది. ఆ గాలిని అలా ఎంతసేపైనా పీల్చుకోవాలనిపించే వాంఛ పుడుతోంది. అలా కాసేపు ఉండేసరికి ఏ ఆనందపు తీగ లోపల జలదరిస్తుందో తెలియదు గానీ కళ్లలో సన్నటి నీటితెరా... అసంకల్పితమైన చిన్న నవ్వు పెదాల మీదా చేరతాయి.

విశ్వేశ్వరరావు గాలి పీల్చుకొని వదిలి గోపీనాథ్ వంక చూస్తూ "గాలి చాలా బాగుంది కదా" అన్నాడు. అని గోపీనాథ్ దగ్గరకి వచ్చి అతని పక్కన నిలబడి



"చాలా ఎక్స్‌లెంట్ ఏరియా" అన్నాడు.

గోపీనాథ్ సిగరెట్‌పారేస్తూ, 'అయితే ప్రొసీడైపోచ్చా' అని అడిగాడు.

విశ్వేశ్వరరావు తలూపి వేలుతో కొండని చూపిస్తూ "ఆ కొండ చుట్టూ ఉన్న లాండంతా మాట్లాడమను" అన్నాడు.

గోపీనాథ్ సుబ్బరాజు వున్న పాక వంక చూస్తూ ఊపాడు. సుబ్బరాజు నిక్కర్ని పైకి లాక్కుంటూ వచ్చాడు.

"ఆ కొండ చుట్టూ ఉన్న లాండంతా కావాలి" అన్నాడు గోపీనాథ్.

"అట్టాగే బాబూ... మాటాడదాం" అన్నాడు సుబ్బరాజు.

***

కోటపాడు సెంటర్లో వూరి కొసాకి మాలపేటకి ఆవలున్న వాసనాల చెట్టు కింద సైకిల్ రిపేరు కం వోటేలు నడిపే బుజ్జిగాడి కొట్లో రెండు కర్రలకి చెక్కని దిగ్గొట్టి చేసిన బల్ల మీద కూర్చుని మొదలుపెట్టాడు సుబ్బరాజు. చెట్టు మొదట్లో నారాయణమూర్తని పేరున్న పెదకాపు, చినబూరయ్య అని పేరున్న చిన కాపు కూర్చుని వింటున్నారు. సైకిలు బాగు చేయించుకుంటున్న చక్రం, ఊసుపోక కూర్చుని రాజకీయాలు మాట్లాడుతున్న ముగ్గుర్నలుగురు ఉన్నారు.

"ఉట్టి వున్నానికి లచ్చిందేవొచ్చి నీ యింటి మొగసాల నిలబడి సూత్తా ఉంటే దిక్కుల్సూద్దంలో అర్తమేటుంది పెదకాపు గారూ... మన్నేం బూవి అమ్మేమంటం లేదాళ్లు. ఏదో కాస్తంత మట్టి తవ్వుకుపోతామంటున్నారు. మనం మెరక తోలమా... అట్టాగే... దానికే ఎకరానికి యాపై వేలిత్తనంటే ఆలోచిచ్చడానికేటుంది?"

సీతగాలి తిరిగిన దగ్గర్నుంచి మొదలుపెట్టాడు సుబ్బరాజు ఈ కతని. పెదకాపు వింటాడు. తలూపుతాడు. కానేం మాటాడ్డు. 'ఈ డొప్పుకుంటే సాలు బేరం సెటిల్మెంటైపోద్ది' అను కున్నాడు సుబ్బరాజు.

"నువ్వట్టగే మా సైతుగా కబుర్లు సెప్తావులే... కానీ పెద్దోళ్లతో యవ్వారమంటే జాయిగా దిగాలి కదా" అన్నాడు చినకాపు.

"జాయిగా పొయ్యే రోజులుకాదు బూరయ్యకాపూ... ఇదంతా ఏటనుకుంటన్నవ్ స్పీదు యుగం... అదనీ...ఇదనీ... కూసున్నావనుకో నీకు రావల్సినదాన్ని ఇంకోడొచ్చి తన్నుకుపోతాడంతే..."

"మావ సెప్పిన యీమాట మాత్తరం సచ్చెం" అన్నాడు చక్రం.

సుబ్బరాజు తన డబ్బా నిక్కరులోంచి బీడిని పైకి తీసి "మావ సెప్పిన ఏ మాటైనా సచ్చెం గాదేటి సెక్రం..." అని లేచి చక్రం దగ్గర అగ్గిపెట్టి తీసుకుని ముట్టించాడు.

మెయ్యోమని హారను మోగించుకుంటూ నాన్‌స్టాప్ వెళ్లింది.

సుబ్బరాజు మళ్లీ వచ్చి బల్ల మీద కూర్చుని...

"అయినా ఈ రోడ్డు సైడు ఎంత డెవలప్పయిపోయిందిరా... అల్లటు పాండవుల మెట్ట సెంటరు కాణ్నించి ఇల్లిటు రాజా నగరం వరకూ యేడన్నా కాసింత జాగా మిగిలిందా... నా సిన్నప్పుడు చాగల్నాట్లో అంబలి తాగిన రోజులు తెల్సు... మీ కసలు తెల్నే తెల్డు, యిప్పుడు? రొండు వింజనీరింగ్ కాలేజీలు... కోళ్లఫారాలు... కరెంటు ఫాక్టరీ...అట్టల ఫాక్టరీ... నూనిమిల్లు... ఒకటేటి? ...ఈ ఏడీబీ రోడ్డంతా డెవలప్మెంటే... డెవలప్మెంటు... అందుకే గుజరాతి వోల్లూ... బుంబాయోల్లూ కూడా యిక్కడికొచ్చి బూవులు కొంటన్నారు. మూడేలు కూడా రాని బూవి యిప్పుడు ముప్పయి లచ్చలంటే కలికాలం కాపోతే ఏటంటావ్..."

"ఆ మాటా కూడా సచ్చెమే... చెట్టిగాళ్ల బుల్రాజు లేడ్యూ... డొక్కు సైకులేసుకొని సామర్లకోట బస్టాండు కాడ జాంకాయిలు... తేగలూ అమ్ముకునేవోడు... ఆడికి నూరంపాలెం కాడ తాతల్నాటిది ఎకరవోఁ... యింకా తక్కువేనో బూవుంది. పాతిక లచ్చలకి ఎవడో గుజరాతీ వోడి కమ్మేసాట్ట... ఆడి లేవిలేటనుకున్నావ్... ఈరోవోండా బండి మీద కాకినాడెల్లి గడ్డం గీకించుకొని వత్తన్నాడు..." లేచి ముందుకొచ్చి చేతులూ తలా తిప్పుకుంటూ చెప్పాడు చక్రం. గోచీ తప్ప ఏమీలేని అతని బక్క శరీరం మీద పక్కటెముకలు పైకీ కిందికీ ఆడినాయి. కంఠమ్మీద నరాలు ఉబ్బి తగ్గాయి.

తలూపి ఊరుకున్నాడు పెదకాపు. చక్రంతో యింకా ఏటో చెప్తున్నాడు సుబ్బరాజు. పొట్టిగా లావుగా వుండే అతను ఎప్పుడూ నిక్కరూ పొట్టి చేతుల చొక్కా వేసుకుంటాడు. కొద్దిగా పళ్లు ఎత్తుగా ఉంటాయి. దాంతో కింది పెదవి వేళ్లాడుతున్నట్టు ఉంటుంది. కింది వరస పల్లు గార పట్టి కనిపిస్తాయి. బానలా ఉన్న పొట్ట మీంచి నిక్కరు జారిపోతున్నట్టు ఉంటుంది.

'చిన్నప్పుడు ఈణ్ణి సుబ్బరాజూ... కంచొట్టలూ... అంటూ తెగ ఏడిపించేవాళ్లు. ఆడి తలా ఈడి తలా ముడెట్టి కాలచ్చేపం చేసే యెదవని తిట్టేవాల్లు. అట్టాంటిది పదేళ్లలో యీడు బోకరుగా మారి బానే సంపాయిచ్చాడు. పెద్దాపురంలో ఇల్లు కట్టి అద్దెకిచ్చాట్ట. భార్యా ఈడూ ఇక్కడూ ఉంటారుగానీ పిల్లలు మాత్రం కాకినాళ్లో కాలేజీ చదువులు. కాకినాట్లోనూ... రాజమండ్రిలోనూ పెద్ద పెద్దోల్లతో కలిసి తిరుగుతాడు'.

బాగా పొద్దోయింది. రోడ్డు కటూ యిటూ కల్లు పాకల దగ్గర గుంపులు గుంపులుగా జనం చేరుతున్నారు.

పెదకాపు లేచి "సందడి పోయింది. యింటికి పోవాలి" అన్నాడు.

సుబ్బరాజు అతని వంక చూసి "సరే... మరైతే ఏదోటి సెప్తే నేనాల్లతోటి మాటాడతా" అన్నాడు.


"సరే... అలాగే చేద్దాం..." అంటూ నడిచాడు పెదకాపు.

***

పెదకాపు, చిన బూరయ్య అన్ని రోజులు పస్తాయించారు గానీ మెట్టైనకాల భూమున్న పెద్దాపురంవోడు ఇచ్చేసాడు. అటుపక్క పొలాలున్న రాజమండ్రి బట్టల సావుకారూ ఇచ్చేసాడు. అడగాలే గానీ ఇచ్చే దానికి యింకా చాలామంది కాచుక్కూచున్నారు.

"ఎకరానికి ఏభై వేలంటే మాటలా? పదెకరాలకి ఐదు లక్షలు. అప్పులన్నీ తీరిపోతాయి. యింకా కావాలంటే పొలమో పుట్రో కొనచ్చుకూడా" అంటూ భార్యకూడా పోరు పెట్టింది.

"సుబ్బారాయుడా... నీ కొండని నువ్వైనా కాపాడుకోలేవా... సామీ..." అని మనసులో అనుకున్నాడు. కానీ...కాటు తిన్నట్టు ఒక తిమ్మిరిలా కమ్మింది ఆలోచన. అవును! నిధికి కావలా కాస్తున్న రెండు తలలపాముల్ని పూజించి తీర్థాలు చేసినంత కాలమూ కొండ వచ్చని దీపంలానే వెలిగింది.



'పొలం కొనడం అవదులే గానీ... అప్పులు తీరడం మాత్రం ఒకే...' అనుకున్నాడు పెదకాపు.

***

"నిన్ను బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా ఏ కంపెనీ వాడైనా పెట్టుకుంటే దేశమంతా దుమ్ము దులిపేస్తావయ్యా" అన్నాడు విశ్వేశ్వరరావు, సుబ్బరాజుతో. సోఫాలో కూర్చుని పాములా మెలికలు తిరుగుతూ నవ్వాడు సుబ్బరాజు.

"నిజం గోపీ... ఇది అవుతుందని నేను అస్సలు అనుకోలేదు. కానీ యింత ఈజీగా చేయగలిగాడంటే దిస్ సుబ్బరాజూ ఈజ్ గ్రేట్" అన్నాడు విశ్వేశ్వరరావు గోపీనాథ్‌తో.

"వీజీగా ఏడయ్యిందండీ బాబూ... ఆ పెదకాపునీ... చిన బూరయ్యనీ ఒప్పించే తలికీ తాతలు దిగొచ్చారు. దాని కోసరం ఎన్ని పుర్రాకులు పడ్డానో ఆ బగమంతుడికే ఎరుక".

గోపీనాథ్ వంకరగా చూస్తూ "ఏవయ్యా సుబ్బరాజూ... వేలూ లచ్చలూ డబ్బులిత్తానంటే మూలనున్న ముసలమ్మ కూడా లేచి ముమ్మైత్‌ఖాన్‌లా డాన్సాడేద్ది... ఆ మాట చెప్పడమే కదా నువ్వు చేసింది. కాపోతే ఒకటికి పస్సార్లు చెప్పుంటావ్ అంతేకదా." అన్నాడు.

సుబ్బరాజు నోటికి తాళం పడ్డట్టు ఆగిపోయాడు. విశ్వేశ్వరరావు, గోపీనాథ్ వంక చూసాడు.

"అయినా ఈ పని నువ్వుకాక ఇంకెవరూ చైలేరు. అది ఒప్పుకుంటాను. అందుకని ఇంకో పాతిక ఎగస్ట్రా. ఓ.కే" నవ్వుతూ అన్నాడు గోపి.

సుబ్బరాజు ముఖం తీర్థంలో లైటులా వెలిగింది. డబ్బులు నిక్కరు అడుగు జేబులో పెట్టుకుంటుండగా విశ్వేశ్వరరావు అన్నాడు "నీలాంటోడు ఊరికొక్కడుంటే మన దేశం అమెరికా అయిపోద్దయ్యా".

సుబ్బరాజు మళ్లీ సిగ్గుగా నవ్వి సోఫాలో ఒద్దిగ్గా కూర్చొని "అవును బాబూ... నాకో సిన్న డౌటుండిపోయిందండి" అన్నాడు. "చెప్పు"

"యాకంగా యింత డబ్బు పోసి మట్టి కొంటున్నారు కదా దేనికా అని."

"అలాటి రహస్యాలు నువ్వడక్కూడదూ... మేం చెప్పకూడదు..." అని నవ్వాడు విశ్వేశ్వరరావు. ఆ రాత్రి డబ్బుని బీరువా లాకర్లో పెట్టి పడుకున్నాకా రెండు పాములు కల్లోకొచ్చాయి సుబ్బరాజుకి.

***

తెచ్చిన డబ్బు ఐదులక్షల్లోనూ చిన్నాచితకా అప్పులన్నీ తీర్చేసాడు పెదకాపు. అన్నీ పోను మిగిలినవి రెండు లక్షలు. కాకినాడ పోయి డెబ్బయి వేలెట్టి హోండా యూనికార్న్ మోటారు సైకిలు కొనేసాడు. భార్యకీ పిల్లలకీ బంగారం కొన్నాడు. ఎంకన్నబాబు దర్శనం కోసం కుటుంబంతో సహా తిరపతిపోయి తలనీలాలు ఇచ్చేసాడు. ఇంటి ముందు కోల సంబరం పెట్టించాడు. కొబ్బరాకుల పందిరి కింద కథ నడుస్తోంది. దీపం సెమ్మెల్లో నూనె దీపాలు ముట్టుకుంటే అంటుకునే నల్లని పొగలు విడుస్తున్నాయి. గుంజలకి కట్టిన కాగడాల నించి బుసబుసా పొగ కమ్ముతోంది.

ఇంటి అరుగుల మీదా మెట్ల మీద కొద్దిపాటి జనం కథని వింటూ హాస్యానికి నవ్వుతూ ఉన్నారు. గుమ్మంలో కూర్చుని కాగడాల వెలుగునీ... నల్లని పొగనీ తదేకంగా చూస్తున్నాడు పెదకాపు కథ అతని చెవుల్లోకి పోడం లేదు. వెలుగు వెనక ఊరంతా కటిక చీకటిలో ఉంది. చీకటిలో చూపు ఆనదు కాబట్టి అక్కడేమీ లేనట్టే ఉంది. పొగ పాములా లేచి పైకి పోతోంది... రెండు తలల పాములా... అది చెదిరి తమ ఇళ్లలోకీ... ఊపిరిలోకి పోవడం తెలుస్తోంది.

***

పొలాలు పొలాల్లా లేవు. పగలూ రాత్రీ నిర్విరామంగా తవ్వకాలు. పొక్లెయినర్ మోత. ట్రక్కుల మోత... గాలిలో జేగురు రంగు ధూళి. మొక్కలూ చెట్లూ గడ్డీ రాళ్లూ రప్పలూ అన్నీ జేగురు వర్ణంలోకి మారిపోయినై. పొలాల్లో నాలుగు అడుగుల గొయ్యి. రోడ్డు పక్కని చిన్న చెరువు మట్టి కప్పడిపోయి బురద గుంటలా తయారైంది.

కొండని తవ్వుకుంటూ పోతోంది పొక్లెయినర్. పచ్చని మొక్కలతో కళకళలాడే కొండ ఎర్రధూళి కమ్ముకుని పోయింది. పొలాలని చూసి గగ్గోలు పెట్టిన రైతులు కొండని తవ్వడం చూసి అల్లకల్లోమైపోయారు. పొలాల గురించి ఏమనగలం? చేజేతులా చేసుకున్న పాపం! కానీ కొండ...

"ఇదేటి సుబ్బరాజూ...ఒకటి కాదు రెండు కాదు ఈ చాగల్నాట్లో వందల ఊళ్ల జనానికి దీపం ఆకొండ...సుబ్బారాయుడు కొలువై ఉన్న కొండ.దాన్ని తవ్వడానికి ఆల్లకేటి రైటుంది?" కోటపాడు సెంటర్లో నిలబెట్టి అడిగాడు పెదకాపు. సుబ్బరాజు దణ్ణంపెట్టి లెంపలేసుకుని అన్నాడు, "నాకేటి తెల్సు పెదకాపుగారూ...పొలాలమ్మి పెడుతున్నా... స్థలాలమ్మి స్తున్నా... కాసింత కమీసను..పొట్టకూటి పని...కానీ యిలా చేత్తరని నాకేటి తెల్సు? కొండ గురించి చెప్పానుకూడా. యిలా చేత్తన్నారేటో మరి."

"ఒకూరు కాదు... రెండూళ్లు కాదు మెట్ట వూళ్లలో ఈ కొండకి మొక్కని గడపుంటదా. అట్టాటి కొండని తవ్వేత్తే ఏంసమాధానం చెప్తాం చెప్పు."

"ఈడో కొంక నక్క ఎదవ... అంతకన్నా ఈడికేటి తెలుద్ది? కాసిన్ని డబ్బులు జోబీలో పడేతలికి కిందా మీదా కానక తల్లి కూడా అమ్మించేవోడు.ఈణ్ణనేదేటి గానీ పదండి. ఆ తవ్వుతున్న తొత్తుకొడుకు నడుగుదాం."

అటు కాకినాడ పోయీ యిటు రాజమండ్రి పోయీ ఎలాగో గోపీనాథ్‌ని పట్టుకుని అడిగారు. గోపీనాథ్ సుబ్బరాజునీ... పెదకాపునీ చూస్తూ... "మీరెవరయ్యా అడగడానికి? ఆ గుట్ట మీదా? మీ పొలాలకి రేటిచ్చి కొన్నాం గానీ అప్పనంగా తీస్కోలేదే. ఆ గుట్ట ఎవడిదో వాడికి రేటిస్తాం. దట్సాల్".

"అదేటి బాబూ మా పొలాలంటే మాయి కాబట్టి యిచ్చుకున్నాం... ఆ కొండ ఎవడిదని యిత్తారు?" "కొండ గవర్నమెంటుది. గవర్నమెంటంటే ఎవరు? వాళ్ల నాన్న మినిష్టరు కదా. అంటే వాళ్లదనమాట. ఆ గవర్నమెంటు దగ్గర కొనుక్కున్నాం... తవ్వుకుంటున్నాం. ఏంటి ప్రోబ్లెం..." కళ్లెర్రబడిపోతుండగా అన్నాడు విశ్వేశ్వరరావు. "అది అట్టాటిట్టాటి కొండకాదు బాబూ... నాగులకొండ... సుబ్బారాయుడి తీర్థం జరిగే కొండ బాబూ..."

"తీర్థమా... అయితేటి? ఇంకోచోట జరుగుద్ది తీర్థం. దేశంలో పాములక్కరువా... తీర్థాలక్కరువా..." వంకరగా నవ్వాడు గోపి. నవ్వి "యిలాంటి మూఢ నమ్మకాల వల్ల ఏం ప్రయోజనం లేదు... అభివృద్ధి కావాలంటే మూఢ నమ్మకాల్ని వదిలెయ్యాలి... అయినా దీని గురించి మీకేం మేం చెప్పాల్సిన పని లేదు..." అన్నాడు విశ్వేశ్వరరావు మెత్తని గొంతుతో "ఆలోచించండి... భూమి తల్లంటూ ఇన్నాళ్ళూ దరిద్రంలో బతికారు. ఆ మూఢ నమ్మకాన్ని వదిలేసి భూమిని మాకిచ్చి లక్షలు సంపాదించారు. అందుకని కొండల గురించి... గుట్టల గురించి మూఢనమ్మకాల్ని వదిలేయండి... డబ్బులు సంపాదించండి... అదే ఎదిగే దారి..." అన్నాడు.

అంతా ఏమనాలో తెలియనట్టు ఉండిపోయారు. అవును అందరూ డబ్బుకోసమే వెంపర్లాడిపోతున్నారు. తరాల తరబడి తమని బతికించిన భూమిని కాసిన్ని లక్షల డబ్బుకోసం... ఆ కాగితాల కోసం వెనకా ముందూ చూడకుండా అమ్మి పారేసారు. యిప్పుడేమని మాట్లాడతారు?

పెదకాపు తేరుకొని ముందుకొచ్చి అన్నాడు. "ఎదిగే దారి కాదు... నిండా మునిగిపోయే దారి... నేల మీద కొండలా చెట్టులా నిలబడ్డ వాళ్లం... ఇయప్పుడీ కాగితాలతో గాల్లోకి ఎగిరిపోతున్నాం. ఎగిరెగిరి పడుతున్నాం. సరే బాబూ... యిది మేం కళ్లు మూసుకుపోయి చేసుకున్న కర్మం... కానీ నాగుల కొండ... దాన్ని తవ్వేయడం మహా పాపం".

గోపీనాథ్ నవ్వాడు. నవ్వి... "అదా మీ బాధ... పోన్లెండి మా పాపానికి మేమే పోతాం... సంపాదించుకుని... మీకేటి?" అని మళ్లీ నవ్వాడు.

"కాదు బాబూ... అది కొండ... ఎన్నో చెట్లు... జీవాలు... వందల పిట్టలు... అన్నింటికీ అది నివాసం... దాన్ని తవ్వేత్తే అయ్యన్నీ ఏమైపోతాయి?"

'ఇలాంటి మూర్ఖులతో ఏం మాట్లాడగలం?" అని విశ్వేశ్వరరావుతో ఇంగ్లీషులో అన్నాడు గోపీనాథ్. అని పెదకాపు వంకా వెనకున్న జనం వంకా చూస్తూ... "డబ్బు... డబ్బుంటే అభివృద్ధి ఉంటుంది. డబ్బు కావాలంటే కొండలేంటి... నదులేంటి... సముద్రాలేంటి... పాతాళంలో ఉన్న గనుల్ని కూడా తవ్వి పారేయాల్సిందే... తవ్వుతాం... చెట్ల గురించీ...పిట్ల గురించీ... పాముల గురించీ ఆలోచిస్తూ కూర్చుంటే అభివృద్ధి ఉండదు. మీలా దరిద్రుల్లా ఉంటాం. దాన్నించి బయట పడండి. డబ్బు గురించి ఆలోచించండి... బాగుపడతారు" అన్నాడు. అని విశ్వేశ్వరరావు వంక చూసి "అసలింతసేపు వీళ్లతో మాట్లాడాల్సిన అవసరమేంటి బాస్" అని పెదకాపు వంక చూస్తూ "ఇంక దయ చేయండి" అన్నాడు.

***

దవడమీద చర్మం లేచిపోయి నెత్తురుఆరిపోయినట్టు భయంకరంగా కనిపిస్తోంది కొండ.ఎర్రటి దుమ్ము చుట్టూ చెట్లనీ పొదల్నీ కమ్మేసి భూకంపం వచ్చినట్టుంది ఆ ప్రదేశమంతా. పొక్లెయినర్లు... ట్రక్కుల ఇంజన్ల రొద...

ఒక చెంపని తవ్వేసారు. కడుపులో కత్తులు పెట్టి కెలికేస్తున్నట్టు పొక్లెయినరు కొండ కడుపులోకి దొలిచేస్తోంది. లోపలి జంతువులూ... పక్షులూ ఎప్పుడో మాయమైపోయాయి. కొన్ని కుందేళ్లూ... ఉడుములూ మొదట్లో దొరికితే వాటిని కొట్టి అక్కడే కాల్చుకుని తినేసారు అక్కడి సెక్యూరిటీవాళ్లూ... కూలీలు. యిప్పుడు కొండ మెల్లి మెల్లిగా చచ్చిపోతోంది.

రోడ్డుకి ఇటువేపు నిలబడి చూస్తున్న పెదకాపు కడుపు తరుక్కుపోతోంది. 'సొంత వూరు... సొంత నేల... సొంత చెట్లు... సొంత చెరువు... సొంత కొండ అనుకున్న వాటిని ఈ ముక్కూ ముఖం తెలియనివాళ్లు యింత దౌర్జన్యంగా యింత యదేచ్ఛగా కొల్లగొట్టుకునిపోతుంటే...యింత చేతకాని వాళ్లమైపోయామేంటిరా?' లోపల దుఃఖమూ... ఉక్రోషమూ... నిస్సహాయత్వమూ... కలగలిసిన ఒక కొండ పెరిగిపోతూ ఉంది.

"సుబ్బారాయుడా... నీ కొండని నువ్వైనా కాపాడుకోలేవా... సామీ..." అని మనసులో అనుకున్నాడు.కానీ...కాటు తిన్నట్టు ఒక తిమ్మిరిలా కమ్మింది ఆలోచన.అవును! నిధికి కాపలా కాస్తున్న రెండు తలలపాముల్ని పూజించి తీర్థాలు చేసినంత కాలమూ కొండ పచ్చని దీపంలానే వెలిగింది. ఎప్పుడైతే డబ్బు గురించి ఆలోచించామో... బువ్వ పెట్టే మట్టిని డబ్బుల కోసం అమ్మేసినామో అప్పుడే మొదటి కాటు పడిపోయింది. రెండు తలల పాములు కొండని వదిలి మనుషుల నిధిని చుట్టుకున్నాయి. కొండలు... పొలాలు... చెట్లూ... చేమలూ... ఇవే మనిషికి అసలు నిధులని మరిచిపోయి డబ్బుని చూసి గంతులేసాం. పాములు పగ తీర్చుకున్నాయి. కాగితాలు ఎగిరిపోయాయి...కొండలు కరిగిపోతున్నాయి. ఈ ఆలోచనతో అతని మెదడు కాగి కనుకొల కుల్లో వేడి నీటి వూట కళ్లని మండించింది.

***

దగ్గర దగ్గర రెండొందల మంది జనం పోగయ్యి పొక్లెయినర్‌కి అడ్డంపడి కొండని తవ్వడానికి వీల్లేదంటూ కూర్చుండిపోయారు. ఊళ్లన్నింటిలోనూ కొండ తవ్వేయడం గురించీ... రెండు తలల పాముల గురించీ రకరకాల కథలు మారుమోగిపోతున్నాయి. మొదటిసారిగా పొక్లెయినర్ డ్రైవర్ సుబ్బారావు పాసుకని వెళ్లినచోట చెప్పలేనంత పొడవైన పాము కనిపించిందని గజగజ వణుకుతూ చెప్పాడు.

అది రెండు తలల పామో... రెండు పాములో చెప్పలేకపోయాడు కానీ నూట నాలుగు జ్వరంతో మంచాన పడిపోయాడు. ●